Reg.APTEL/2011/39524

# న్యూస్‌వన్

తెలుగు దినపత్రిక

NEWS ONE TELUGU DAILY

Circulated byAnakapalli, AlluriSeetharamaraju, Vizianagaram,Parvathipuram, Srikakulam, Kakinada,East Godavari,Konaseema, West Godavari, Krishna,Guntur, Bapatla,NTR,Anantapuram, Satyasai Kurnool,Nandyala, Chittoor,Tirupati,Annamayya, Telangana State

విశాఖపట్నం బుధవారం 12-02-2025 PUBLISHED FROM VISAKHAPATNAM సంపుటి :12 సంచిక :103 వెల: 2/- పేజీలు 4

## జేఈఈ మెయిన్ మొదటి సెషన్ ఫలితాలు విడుదల
## ఇద్దరు తెలుగు విద్యార్థులకు 100 పర్సంటైల్

అఖిల భారత స్థాయిలో ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్ మొదటి సెషన్ ఫలితాలు నేడు విడుదలయ్యాయి. దేశవ్యాప్తంగా 14 మంది విద్యార్థులు 100 పర్సెంటైల్ సాధించారు. అమ్మాయిల విభాగంలో ఏపీకి చెందిన గుత్తికొండ మనోజ్ఞకు 100 పర్సంటైల్ వచ్చింది. తెలంగాణ విద్యార్థి బనిబ్రత మజీ కూడా 100 పర్సంటైల్ సాధించాడు. మొదటి సెషన్ ఫలితాలకు https://jeemain.nta.nic.in వెబ్ పోర్టల్ ను సందర్శించాలి. ఈ ఏడాది జనవరి 22 నుంచి 29 వరకు జేఈఈ మెయిన్ పరీక్షలు నిర్వహించడం తెలిసిందే. జేఈఈ మెయిన్ మొదటి సెషన్ పరీక్షకు 9 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా, ఏప్రిల్ 1 నుంచి 8వ తేదీ వరకు జేఈఈ మెయిన్ రెండో సెషన్ పరీక్ష జరగనుంది.

## ఒక్కరోజే రూ.9 లక్షల కోట్లు నష్టపోయిన ఇన్వెస్టర్లు

మార్కెట్ నష్టాలకు ట్రంప్ టారిఫ్ ప్రభావంతో పాటు పలు కారణాలు
అమ్మకాలకు మొగ్గు చూపిన విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు

దేశీయ స్టాక్ మార్కెట్ ఈరోజు భారీగా నష్టపోవడంతో ఇన్వెస్టర్లు ఒక్కరోజులోనే లక్షల కోట్లు నష్టపోయారు. సెన్సెక్స్ ఈరోజు 1,000 పాయింట్లకు పైగా నష్టపోయింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ వ్యాల్యూ సుమారు రూ.9.3 లక్షల కోట్లు ఆవిరై రూ.408.52 లక్షల కోట్లకు తగ్గింది. మార్కెట్ నష్టాలకు వివిధ కారణాలు ఉన్నాయి స్టీల్, అల్యూమినియంపై అమెరికా టారిఫ్ పెంపు, ఎఫ్ఐఐ అమ్మకాల వెల్లువ, రూపాయి పతనం వంటి పలు కారణాలు ఇన్వెస్టర్ల నష్టానికి దారితీశాయి.

## పోర్టు వెనక్కిచ్చేసినా కేసులే...కేసులు !



(న్యూస్ వన్ ప్రత్యేక ప్రతినిధి ) కాకినాడ పోర్టును కబ్జా చేసి మళ్లీ తిరిగి ఇచ్చేశారన్న ప్రచారం జరుగుతోంది. అయితే కేసులు మాత్రం అంత తేలికగా వదిలి పెట్టే అవకాశాలు లేవు. కేసును కొనసాగించేందుకే సీఐడీ నిర్ణయించుకుంది. వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ పై సీఐడీ చాలా కఠినంగా వ్యవహరిస్తోంది. వాటాలను అరబిందో రియాలిటీ అండ్ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్‌కు బదిలీ చేయించేందుకు బెదిరింపులకు పాల్పడింది విక్రాంత్ రెడ్డేనని సీఐడీ హైకోర్టుకు తెలిపింది. 2020లో కాకినాడ సీ పోర్టుతో పాటు కాకినాడ సెజ్‌కు సంబంధించిన వాటాలపై హక్కులను వదులుకోవాలని పోర్ట్ ప్రమోటర్ కేర్ రావును తన ఇంటికి పిలిచి మరీ విక్రాంత్ బెదిరించారని సీఐడీ హైకోర్టుకు తెలిపింది. కాకినాడ సీ పోర్టుకు రూ.3,666 కోట్లు, కాకినాడ సెజ్‌కు కూడా నష్టం చేకూర్చేలా చేశారని సీఐడీ స్పష్టంచేసింది. అంతే కాదు ఎడిటింగ్ సంస్థతో కుమ్మక్కు అయి తప్పుడు నివేదికలు రెడీ చేయించడం.. వాటితో నోటీసులు ఇప్పించడం లాంటివన్నీ ఆయన కనుసన్నల్లోనే జరిగాయన్నారు. ఈ వ్యవహారంలో పోర్టును తిరిగి కేవీరావు ఔరో రియాలిటీ ఇచ్చేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే కేసును మాత్రం సీఐడీ వదిలి పెట్టే అవకాశం లేదు. ఇందులో ఇన్వాల్వ్ అయిన ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించు కున్నట్లుగా తెలుస్తోంది. చాలా మంది ముందస్తు బెయిల్స్ కోసం ప్రయత్నిస్తున్నారు. న్యాయపరమైన అవకాశాలు ముగించిన తర్వాతనే పోలీసులు చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి




## అడవులను తలపిస్తున్న... టిడ్కో ఇల్లు..!

- మూళ్ళ పొదలు,పిచ్చి మొక్కలతో
- వసతుల్లేని టిడ్కో ఇళ్లెందుకు ?
- సదుపాయాలు కల్పనలో అలసత్వం
- ఇంకెన్నాళ్లు ఈ ఎదురు చూపులు
- లబ్ధిదారులు కష్టాలు తీరేదెప్పుడు
- బ్యాంకు రుణాలు నుండి గట్టెకేది ఎలా
- కూటమి ప్రభుత్వంలో న్యాయం జరిగేనా

(న్యూస్ వన్ బ్యూరో) గత జగన్ ప్రభుత్వం ఐదేళ్ల నిర్లక్ష్యం పేదలకు శాపంగా మారింది. నిరుపేదలకు నీడ కల్పించాలనే సంకల్పంతో నిర్మించిన టిడ్కో ఇల్లు అభాసు పాలు అయ్యాయి...ఏళ్ళు గడుస్తున్నా లబ్ధిదారులకు ఎదురు చూపులే మిగిలాయి.బ్యాంకు లకు రుణాల చెల్లించలేక....ఉన్న ఇళ్లకు అద్దెలు కట్టలేక....అలాని టిడ్కో ఇల్లుకు వచ్చేదేమంటే నివాసాలు చుట్టూ మధ్యలో మట్టిగుట్టలు, పిచ్చిమొక్కలు, ఏపుగా పెరిగిన దుబ్బులతో భయంకరంగా కనిపిస్తున్నాయి. టిడ్కో గృహాలపైకి పిచ్చి తీగలు పెనవేసుకుపోయే పరిస్థితి ఏర్పడింది. ఇళ్లలోకి వెళ్లేందుకు దారి కూడా లేనంతగా పొదలు అల్లుకుపోయాయి. చాలా ఫ్లాట్లకు తలుపులు, కిటికీలు దెబ్బతిన్నాయి. కొన్నింటికి కిటికీల అద్దాలు పగిలి పోయాయి . గదుల్లో టైల్స్ (మిగతా 2వ పేజీలో)

## మధ్యప్రదేశ్ రోడ్డు ప్రమాదం బాధాకరం

### బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి
### పల్లా శ్రీనివాస్ యాదవ్



అమరావతి, న్యూస్ వన్ ప్రతినిధి :కుంభమేళాకు వెళ్లి తిరిగి వస్తూ, మధ్యప్రదేశ్ రాష్ట్రం, జబల్పూర్ సమీపంలో, సిహెూరా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు ఏపీ ప్రజలు మృతిచెందడం తీవ్రంగా కలిచివేసింది. దైవదర్శనాలకు వెళ్లి అనంతలోకాలకు వెళ్లిన వారి కుటుంబాలకు తెలుగుదేశంపార్టీ తరపున తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నాం. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

## 24 నుంచి అసెంబ్లీకి జగన్ వస్తాడా...!



(న్యూస్ వన్ బ్యూరో) ఈ నెల ఫిబ్రవరి 24 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్‌ను రాజ్ భవన్ విడుదల చేసింది. ఈ సారి మూడు వారాల పాటు అసెంబ్లీని నిర్వహించే అవకాశం ఉంది. ప్రతిపక్షంగా ఉన్న వైసీపీ వస్తుందా రాదా అన్నదానితో నిమిత్తం లేకుండా చాలా అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా ప్రజల ముందు పెట్టాల్సిన చాలా సమాచారం ఉందని.. రాష్ట్రాన్ని ఏ స్థాయిలో వైసీపీ నేతలు దోచుకున్నారో ఆ లెక్కలన్నీ ఇప్పుడు ఆధారాలతో సహా బయట పెట్టాల్సి ఉందన్న నిర్ణయానికి వచ్చినట్లుగా చెబుతున్నారు. మద్యం, ఇసుక స్కాముల్లో ఎంత దోపిడీ చేశారో.. ఎవరెవరు మనీ లాండరింగ్ కు పాల్పడ్డారో మొత్తం ఆధారాలతో సహా ఇప్పటికే వెలుగులోకి వచ్చింది. ఆ వివరాలను ప్రజల ముందు ఉంచేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. మరో వైపు జగన్మహెూన్ రెడ్డి తాను అసెంబ్లీకి రానని తాడేపల్లి ప్యాలెస్ నుంచే ప్రశ్నిస్తానని అంటున్నారు. పథకాల కోసమే చంద్రబాబుకు ప్రజలు ఓట్లేశారని అంటున్న ఆయన అదే నిజం అయితే.. అసెంబ్లీకి వచ్చి కొన్ని పథకాలను ఇంకా ప్రారంభించకపోవడంపై ప్రశ్నించాల్సి ఉంది. కానీ అసెంబ్లీకి రావడం అంటే కొట్టుకోవడానికే అన్నట్లుగా ఆయన తీరు మనస్తత్వం ఉంది. అందుకే వెళ్లాల్సిన పని లేదని అనుకుంటున్నారు.ప్రజాస్వామ్యంలో అసెంబ్లీకి వెళ్లని ప్రతిపక్షం ప్రజల మద్దతు కూడగట్టడం అసాధ్యం అవుతుంది. అసెంబ్లీలో అవమానిస్తే. దాడులు చేస్తే అది జగన్ కే ప్లస్ అవుతుంది . ప్రజలు అలాంటివాటిని సహించరు. చంద్రబాబు కూడా అలాంటి వాటిని ప్రోత్సహించరు. అయినా జగన్ ధైర్యం చేయలేకపోతున్నారు. సంఖ్యాబలం ప్రకారం మాట్లాడే (మిగతా 2వ పేజీలో)

## ఉండవల్లి వైసీపీలో చేరితే ఇక అంతే !



(న్యూస్ వన్ బ్యూరో ) పార్టీ నుంచి అందరూ వెళ్లిపోతున్నారు.. వచ్చే వారు లేరు.. ఖాళీగా ఉన్న వారినైనా చేర్చుకోవాలని జగన్ అనుకుంటున్నారేమో కానీ పార్టీలో వారు చేరుతారు.. వీరు చేరుతారు అని వృద్ధ నేతల గురించి ప్రచారం చేసేసుకుటున్నారు. శైలజానాథ్ పార్టీలో చేరిక తర్వాత .. ఉండవల్లి అరుణ్ కుమార్ వైసీపీలో చేరుతారన్న ప్రచారం చేస్తున్నారు. ఆయన రేపో మాపో జగన్ సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకుంటారని చెబుతున్నారు. ఈ అంశంపై సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతున్నా ఆయన మాత్రం ఖండించలేదు.కాంగ్రెస్ పార్టీలో పదవి అయిపోయిన తర్వాత కిరణ్ కుమార్ రెడ్డితో కలిసి నడిచిన ఆయన ఆ తర్వాత పూర్తిగా రాజకీయాలకు దూరమయ్యారు. తాను రాజకీయాల్లో లేనని కానీ రాజకీయాల గురించి మాత్రం మాట్లాడతానని చెప్పుకుంటారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రివర్స్ లో జగన్ కోసం సలహాలిచ్చేందుకు ఆయన గొప్పగా పాలిస్తున్నాడని చెప్పేందుకు చాలా సార్లు మీడియా ముందుకు వచ్చారు. అదే చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు క్వార్టర్ బాటిల్స్ తెచ్చి అదేదో చంద్రబాబుకు ఆదాయం వెళుతుందన్నట్లుగా తప్పుడు ప్రచారం చేసేవారు. అదే జగన్ చేసిన మద్యం వ్యాపారంపై మాత్రం ఎప్పుడూ మాట్లాడలేదు.పవన్ కు శ్రేయోభిలాషిలాగా కబుర్లు చెప్పే ఆయన ఇప్పుడు ఆయన మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి వైసీపీలో చేరితే.. ఆయన మేధావితనం అంతా తలకిందులు అవుతుంది. ఆయన క్యారెక్టర్ ను తక్కువే చేసేవారు ఎక్కువ అవుతారు. అయితే జగన్ కోసం ఆయన ఏమైనా చేస్తా అనే టైపులో ఇంత కాలం న్యూట్రల్ ముసుగులోనే పనులు చక్కబెట్టారు కాబట్టి ఇప్పుడు వైసీపీలో చేరినా పోయేదేమీ ఉండదని ఆయన అనుకుంటే జగన్ తో కండువా కప్పుకోవచ్చు. అసలే ఇప్పుడు వైసీపీ తరపున మాట్లాడేందుకు అంబటి రాంబాబు తప్ప మరొకరు కనిపించడం లేదు.

### తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి తెప్పోత్సవాల్లో భాగంగా
## అమ్మవార్లకు స్నపన తిరుమంజనం



తిరుమల, న్యూస్ వన్ ప్రతినిధి :

తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి తెప్పోత్సవాల్లో భాగంగా 4వ రోజు సోమవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీ గోవిందరాజస్వామివారు తెప్పలపై విహరించి భక్తులను కటాక్షించారు. ఇందులో భాగంగా ఉదయం 10.30 నుండి 11.30 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు. అనంతరం సాయంత్రం 6.30 నుండి రాత్రి 8 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీ గోవిందరాజస్వామివారు తెప్పపై విహరించి భక్తులకు కనువిందు చేశారు. అనంతరం ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులను అనుగ్రహించారు. తెప్పలను అధిరోహించిన స్వామి, అమ్మవార్లు పుష్కరిణిలో మొత్తం ఏడు చుట్లు తిరిగి భక్తులకు అభయమిచ్చారు. కాగా మంగళవారం శ్రీ (మిగతా 2వ పేజీలో)






# సంపాదకీయం

## బడి 'జట్టు'-బడ్జెట్టు

మొత్తంమీద ఈసారి బడిజట్టులో మధ్యతరగతి కింది తరగతివాళ్ళను బాగా పట్టించుకున్నారట కద యాదన్నా, అన్నాడు నర్సింగ్. పక్కనే ఉన్న దామోదర్ అడిగాడు బడిజట్టు ఏమిటి నర్సింగ్ అన్నాడు. అదే అన్నా, ఆర్థిక మంత్రి పార్లమెంటులో పెద్ద స్పీచ్ ఇచ్చి ఎలా సంపాదించాలి ఎలా ఖర్చు చేయాలి అని సూటుకేసులో పేపర్లు పెట్టుకొస్తారే! అది నేననేది అనేసరికి దామోదర్ నవ్వాడు. ఎందుకన్నా నవ్వుతావు అన్నాడు నర్సింగ్ అమాయకంగా. దాన్ని బడ్జెట్ అంటారు నర్సింగ్ అని చెప్పాడు దామోదర్. ఇద్దరి మాటలూ వింటున్న యాదన్న అందుకొని, మన నర్సింగ్ చెప్పిన దానిలో తప్పేమీ లేదు దామోదర్, లోతుగా చూస్తే ఎవరి బడి వారికుంది పార్లమెంటులో అంటే ఎవరి స్కూల్ వారిదన్నమాట! వాళ్ళ వాళ్ళ బడులకు మంచిపనులు ఈ బడ్జెట్ ద్వారా చేస్తారన్న మాట. ఏ బడ్జెట్టుకైనా ముందు చాంబర్ ఆఫ్ కామర్సు వ్యాపారవేత్తలతో, ప్రరిశ్రమల యజమానులతో కలిసి ఆర్థిక మంత్రి సంప్రదింపులు జరుపుతారు కదా. అది సంగతి. నాకు నోరు తిరగక అలా అన్నాను కాని దానిలోనూ నిజముందని యాదన్న భలే చెప్పిండు అని నర్సింగ్ మురిసిపోయాడు. ఇక మిత్రులందరితో ఈ విషయం చెప్పుకోవాలని అక్కడినుండి లేచాడు. ఈ బడ్జెట్ ప్రవేశపెట్టిన మరుసటిరోజు అన్ని పేపర్లలో రకరకాల వార్తలొస్తాయి. మధ్యతరగతిని లెక్కలోకి తీసుకున్న ప్రభుత్వం అని ఒకరు, ఉన్నోళ్ళకే మళ్ళీ పెద్ద పీట అని ఒక పేపర్లో, అందరినీ ఆదరించిన బడ్జెట్ అని ఒక పేపరు ఇలా ఎన్నో వార్తలు. అసలు ఏ పద్దుల్లో ఎలాంటి ఖర్చులు చేస్తారు, ఏ సరుకులు, వస్తువులు ధరలు తగ్గుతాయి, ఏవి పెరుగుతాయి, రూపాయి రాక ఎలా ఉంటుంది, రూపాయి పోక ఎలా ఉంటుంది అన్న విశ్లేషణలూ ఉంటాయి. ఇక నిజాలు మాత్రమే నిఖార్సుగా రాసే పత్రికలు ఇది కార్పోరేట్ల బడ్జెట్ అని, పెద్దోళ్ళ బడ్జెట్ అని, ఇది మామూలేననీ రాస్తాయి. ఈ రాతలు కూడా మామూలే. మేమవన్నీ పట్టించుకోమని ఈ ఆర్థిక పద్దులు ప్రవేశపెట్టేవాళ్ళూ అంటుంటారు. ఇక ప్రధాని ఎవరైనా సరే మా ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టింది అభివద్ధికరమైన బడ్జెట్ అని అనడం, తరువాత రాష్ట్రపతి తనకు రాసిచ్చిన ఉపన్యాసం చదువుతూ ఇది దేశాన్ని ముందుకు తీసుకుపోయే బడ్జెట్ అని మాట్లాడడం కూడా మామూలే. వీళ్ళంతా కూడా అసలు అంబేద్కర్ మహాశయుడు, ప్రజల పార్టీలు దీనిపై ఏమి చెప్పారు అని ఒక్కసారి చూసినా పరిస్థితి ఇలా ఉండదు. ఇవన్నీ చూసి అది నిజమేనా, ఇది నిజమేనా అని సామాన్య ప్రజలు తమ తెలివికి పదును పెట్టి ఆలోచిస్తారు. ఏముందిలే కొత్త సీసాలో పాత సారా అని కొందరు పెదవి విరుస్తారు. ఆ.. ఈ బడ్జెట్ మన బతుకుల్ని బాగు చేసిందెప్పుడు, ఏ బడ్జెట్ చూసినా ఏమున్నది గర్వకారణం అని కొద్దిగా కవిత్వాన్ని కలిపి చెప్పేవాళ్ళూ ఉన్నారు. కొందరు కవులు కూడా తమవంతు బాధ్యతగా ఆర్థికాంశాలతో కవిత్వం రాస్తారు. ఇక కార్మిక, ఉద్యోగ సంఘాలు అసలు ఇది ఎవరి బడ్జెట్ అని సదస్సులూ పెడతారు. విద్యార్థి, యువజన సంఘాలు కూడా తమ వంతుగా ప్రచారాలు చేస్తుంటారు. అసలు అక్కడినుండే కదా ముందు తరం తయారయ్యేది. అందుకే విద్యకు, వైద్యానికి ఈ బడ్జెట్లలో వేసే పీట రోజు రోజుకూ చిన్నగైపోవడం గురించి వాళ్ళు చెబుతారు. వాటికి ఇన్ని కోట్లు కేటాయించామని ప్రభుత్వాలు చెబుతారు కాని మొత్తంలో వాటి శాతం తగ్గిపోవడం మనం చూస్తూనే ఉంటాము. చెప్పేటోళ్ళు చెబుతూనే ఉంటారు, రాసేటోళ్ళు రాస్తూనే ఉంటారు. కాని ఎన్నికల సమయంలో ఇవేవీ ప్రజలకు గుర్తుండవు. అందుకే వాళ్ళకు సరిపోయే బడ్జెట్లు ఇంకా రావడం లేదు. ఎప్పుడూ ప్రజలను ఏమీ అనకూడదు. ఎందుకంటే వాళ్ళకు అర్థమయ్యేటట్లు చెప్పడం లేదని కాదు కాని అర్థం చేయడం చాలా చాలా ముఖ్యం. వాళ్ళ నుండే ప్రజల్ని బాగు చేసే నాయకులు వస్తారు మరి. పునాది వాళ్ళ నుండి ఉంటే కాని తాము కోరుకున్న సమాజం రాదు. ఇలాంటి బడ్జెట్లు ఎన్నో వస్తూ పోతూ ఉంటాయి ఎన్నికల్లాగ. అంతర్లీనంగా మార్పు అనేది కొద్దిగానైనా వస్తుందో లేదో చూసుకోవడం అభ్యుదయ శక్తులకు ఒక బాధ్యతగా ఉండాలి. ఒక పక్క కొత్త పారిశ్రామిక వేత్తలకు ఇన్ని కోట్ల రుణాలిస్తామని అంటూనే ఇంకో పక్క బీమాలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు నూరు శాతానికి పెంచుతున్నామంటారు. వేతన జీవుల వెతలన్నీ ఇక మటుమాయం, మా అక్క అందరినీ బాగా చూసుకుంటుంది అనుకునేలోపు పెంచిన ఆదాయపు పన్ను పరిమితి ద్వారా ఎలాంటి లాభంలేదని పాత, కొత్త ఆదాయపు పన్ను లెక్కలతో సహా ఇంకొకరు పోస్టు పెడతారు. కనీసం ఆనందపడిన సమయం కొద్దిగానైనా మిగిలించకుండా ఈ వార్తలేమిటిరా బాబూ అనుకునే ఉద్యోగులు మళ్ళీ దేంట్లోనో పొరబడ్డామని కించిత్ నిరాశ పడతారు. ఆశ దోశ అప్పడం అన్నట్టు ఈ బడ్జెట్టు ఉందని వాపోతారు. బడ్జెట్ పద్మనాభాలు, రాజబాబులు, రేలంగిలు, బ్రహ్మానందాలు ఎవ్వరూ ఆనందంతో లేరని, నవ్వించేవాళ్ళెవరూ నవ్వుతూ లేరని, దాన్నే తాత్వికంగా బడ్జెట్ అందురు అని ఒక ఆర్థిక స్వామీజీ చెప్పొచ్చు. ఏది రాక ఏది పోక అంతా భ్రమ నాయనా, అంతా భ్రమే తల్లీ అందుకే ఈ డబ్బు మీద వ్యామోహం మాని ఇహలోకం మీద పొందే సుఖాలు ఏవీ ఉండవని నమ్మండి. అనే స్వామీజీకి%తా%.మీరెప్పుడూ అంతే తత్వం మాకు చెబుతారు, ఆర్థికం వాళ్ళకు చెబుతారు. సుఖంగా ఉండేది వాళ్ళు, కష్టాలు పడేది, పడాల్సింది మేము అన్న సమాధానం ఎదురైనప్పుడే అసలు విషయం తెలిసేది. స్వాములెప్పుడూ రాజులకు, తరువాత రాజకీయ పార్టీలకు, ప్రభుత్వాలకు అనుకూలంగా ఉంటారని తెలుసుకుంటారు జనాలు. ప్రవచనాలు చెప్పేవాళ్ళెప్పుడూ ఈ బడ్జెట్లు మంచివి కావని చెప్పనే చెప్పరు. ఇంకా వీలైతే రాజులు, వారి బాధ్యతలు, వాళ్ళ ఖర్చులకు ప్రజలే కదా డబ్బు సమకూర్చాలని చెప్పినా చెప్పొచ్చు. కాబట్టి నర్సింగ్ చెప్పినట్టు ఈ ఆర్థిక పద్దులకు సంబంధించి ఎవరి బడి వాళ్ళకుంటుంది. ఎవరి బడికి వాళ్ళు సౌకర్యాలు, కేటాయింపులు చేస్తూ ఉంటారు.

# ఆన్ లైన్ మోసాలపై అప్రమత్తంగా వుండాలి

## జిల్లా ఇన్ఫర్మేటిక్స్ అధికారి నరేంద్ర




విజయనగరం సిటీ ఫిబ్రవరి 11, న్యూస్ వన్ ప్రతినిధి :ఆన్ లైన్ సేవలపై తగిన పరిజ్ఞానంతో అప్రమత్తంగా వుండటం ద్వారా మాత్రమే సైబర్ మోసాలకు గురికాకుండా సురక్షితంగా వుండగలమని జిల్లా సూచన విజ్ఞాన అధికారి(డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేటిక్స్ అధికారి) ఆర్.నరేంద్ర అన్నారు. ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ పరిధిలోని జాతీయ సూచన విజ్ఞాన కేంద్రం(నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో మంగళవారం సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం నిర్వహించారు. ప్రతి ఏటా ఫిబ్రవరి రెండో మంగళవారం సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవంగా(ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్) ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులకు అంతర్జాల సేవలను సురక్షితంగా ఎలా వినియోగించాలనే అంశంపై అవగాహన కల్పించారు. డిజిటల్ గుర్తింపును గానీ, వ్యక్తిగత సమాచారాన్ని అనధికారిక వెబ్‌సైట్లలో షేర్ చేయరాదని, ఒన్‌టైమ్ పాస్‌వర్డు సమాచారాన్ని ఇతరులతో పంచుకోరాదని చెప్పారు. అదే విధంగా బహిరంగ ప్రదేశాల్లో ఉచితంగా లభించే వైఫై వినియోగంచడం వల్ల మన వ్యక్తిగత సమాచారం తస్కరించే ప్రమాదం వుందని తెలిపారు. తెలియని ఫోన్ నెంబర్ల నుంచి వీడియోకాల్స్ వచ్చినపుడు స్పందించరాదని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు డిజిటల్ సేవలపై అవగాహన పెంచుకుంటూ సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు, సిపిఓ పి.బాలాజీ, జె.ఎన్.టి.యు. అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీకాంత్, ఇన్ఫర్మేటిక్స్ అధికారి ఏ.బాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు

# విజయవాడ మెట్రో రైలు కల సాకారం

**గన్నవరం, పెనమలూరు నుంచి రెండు కారిడార్లుగా మెట్రో నిర్మాణం**

**91 ఎకరాలు అవసరమంటూ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు ఏపీఎంఆర్‌సీ ప్రతిపాదనల అందజేత**

**విజయవాడలోని పీఎన్‌బీఎస్ వద్ద ఈ రెండు కారిడార్లు కలిసేలా నిర్మాణం**

**తొలి కారిడార్ పొడవు 26 కిలోమీటర్లు.. రెండో కారిడార్ పొడవు 12.5 కిలోమీటర్లు**



విజయవాడ, న్యూస్ వన్ ప్రతినిధి :విజయవాడ నగర వాసుల మెట్రో కల త్వరలోనే నిజం కానుంది. మెట్రో కారిడార్ నిర్మాణానికి ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల పరిధిలో 91 ఎకరాల భూమి అవసరమని గుర్తించిన ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీ) తాజాగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశను కలిసి ప్రతిపాదనలు అందజేసింది. తొలుత నాలుగు కారిడార్లుగా విజయవాడ మెట్రో రైల్ నిర్మాణం చేపట్టాలని భావించారు. అయితే, ప్రస్తుతం గన్నవరం, పెనమలూరు నుంచి రెండు కారిడార్లు నిర్మించడంపైనే దృష్టి పెట్టారు. విజయవాడలోని పీఎన్‌బీఎస్ వద్ద ఈ రెండు కారిడార్లు కలిసేలా గతంలో రూపొందించిన ప్రతిపాదనల ప్రకారమే భూసేకరణ చేయనున్నారు.తొలి కారిడార్ పొడవు 26 కిలోమీటర్లు. ఇది పీఎన్‌బీఎస్ నుంచి ప్రారంభమై విజయవాడ రైల్వే స్టేషన్‌ను కలుపుతూ ఏలూరు రోడ్డు మీదుగా రామవరప్పాడు వద్ద జాతీయ రహదారిపైకి వచ్చి, అక్కడి నుంచి గన్నవరం వెళ్తుంది. ఈ క్రమంలో యోగాశ్రమం, విమానాశ్రయం, గూడవల్లి, చైతన్య కళాశాల, నిడమానూరు, ఎంబీటీ సెంటర్, ప్రసాదంపాడు, రామవరప్పాడు చౌరస్తాల మీదుగా ప్రయాణిస్తుంది. ఆ తర్వాత ఏలూరు రోడ్డులోకి వంపు తిరిగి గుణదల, పడవల రేవు, మాచవరం డౌన్, సీతారాంపురం సిగ్నల్, బీసెంట్‌రోడ్డు రైల్వే స్టేషన్ మీదుగా పీఎన్‌బీఎస్‌కు రైలు చేరుకుంటుంది.12.5 కిలోమీటర్లు మేర ఉండే రెండో కారిడార్ పీఎన్‌బీఎస్ నుంచి ప్రారంభమై బందరు రోడ్డు మీదుగా బెంజిసర్కిల్, ఆటోనగర్, కానూరు, పోరంకి మీదుగా పెనమలూరు వరకు వెళ్తుంది. ఈ క్రమంలో పీఎన్‌బీఎస్, బందరు రోడ్డులో విక్టోరియా మ్యూజియం, ఇందిరాగాంధీ స్టేడియం, బెంజి సర్కిల్, ఆటోనగర్, అశోకనగర్, కృష్ణానగర్, కానూరు సెంటర్ తాడిగడప, పోరంకి మీదుగా పెనమలూరుకు చేరుకుంటుంది.

# 21వ శతాబ్దం భారత్‌దే..

## ఇది నిపుణులు చెబుతున్న మాట : ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, భారత్ తన సొంత వృద్ధినే కాకుండా.. ప్రపంచ వృద్ధి రేటును నడిపిస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత ఇంధన వార్షికోత్సవాలు 2025 ను వర్చువల్‌గా ప్రారంభించి మాట్లాడారు. '21వ శతాబ్దం భారత్‌దేనని ప్రపంచంలోని నిపుణులు చెబుతున్నారు. భారత్ తన సొంత వృద్ధినే కాకుండా.. ప్రపంచ వృద్ధి రేటును నడిపిస్తోంది. మన ఇంధన రంగం కూడా ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తుంది. వనరులు, మేధోసంపత్తి, ఆర్థిక బలం, రాజకీయ స్థిరత్వం, ప్రపంచ సుస్థిరతపై భారత్‌కు నిబద్ధత ఉన్నాయి. సౌర ఉత్పత్తి సామర్థ్యాన్ని రెండింతలు చేసి.. మూడో అతిపెద్ద సౌరశక్తిని ఉత్పత్తి చేసే దేశంగా నిలిచాం. మన శిలాజేతర ఇంధన శక్తి మూడు రెట్లు పెరిగింది. పారిస్ జీ20 ఒప్పంద లక్ష్యాలను చేరుకున్న మొదటి దేశం భారత్. రానున్న రెండు దశాబ్దాలు భారతదేశానికి అత్యంత కీలకం. మరో ఐదేళ్లలో ముఖ్యమైన మైలురాళ్లను దాటబోతున్నాం. 2030 నాటికి నికర జీరో కర్బన ఉద్గార లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. అంతేకాక.. ఏటా 5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని ఆయన పేర్కొన్నారు.ఇక, ప్రధాని మోదీ ప్రస్తుతం ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ తో కలిసి మోదీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించనున్నారు. భారత్, ఐరోపా దేశాల అభివృద్ధితో పాటు మెరుగైన జీవన విధానం కోసం 'ఏఐ'ని ఉపయోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంతకుముందు ఓ ఇంటర్వ్యూలో మేక్రాన్ స్పష్టం చేశారు.

మోదీ ఫ్రాన్స్‌లో పర్యటించడం ఇది ఆరోసారి. అనంతరం 12వ తేదీ సాయంత్రానికి అమెరికాకు చేరుకోనున్నారు. ఈసందర్భంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అవుతారు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి భేటీ కానున్న ప్రధాని మోదీ.. ఈసందర్భంగా ఆయనతో పలు అంశాలపై ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశముంది. పలు దేశాలపై ట్రంప్ టారిఫ్‌లు విధిస్తున్న నేపథ్యంలో మోదీ అమెరికా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఏపీలో రెండు చోట్ల బర్డ్ ఫ్లూ వైరస్



అమరావతి, న్యూస్ వన్ ప్రతినిధి : తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని రెండు ప్రాంతాల్లో కోళ్ల మరణాలకు ఏవియన్ ఇన్ఫ్లూయెంజా (హెచ్5 ఎన్1 -బర్డ్ ఫ్లూ) వైరస్ కారణమని తే లింది. వివిధ ప్రాంతాల్లో చనిపోయిన కోళ్ల నుంచి తీసిన నమూనాలను మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉన్న నేష నల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైసె క్యూరిటీ యానిమల్ డిసీజెస్ (ఐసీఏ ఆర్-ఎన్ఐహెచ్ఎస్ఏడీ) కు పంపారు. అందులో పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం వేల్పూరు, తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు అగ్రహారంలోని ఫారాల నుంచి పంపిన రెండు నమూనాలు పాజిటివ్‌గా గుర్తించారు. దీంతో పశుసంవర్ధకశాఖ అధికారులు ఆ రెండు కోళ్ల ఫారాల్లో కోళ్లను పూడ్చిపెట్టడంతోపాటు.. కిలోమీటరు వరకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. పరిసర ప్రాంతాల్లోనూ వైరస్ నియంత్రణకు చర్యలు చేపట్టారు. రెడ్‌జోన్‌లో 10 బృందాలు, సర్వేలెన్స్ జోన్‌లో 10 బృందాలతో నిత్యం పర్యవేక్షిస్తున్నారు. ఫారాల్లో పనిచేస్తున్న కార్మికుల ఆరోగ్య పరిస్థితిని గమనిస్తున్నారు. కోళ్ల వ్యాధులపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

**వలస పక్షుల్లో ఉండే వైరస్...**

వివిధ దేశాల నుంచి వచ్చే వలస పక్షుల్లో ఉండే వైరస్.. వాటి రెట్టల ద్వారా జలాశయాల్లోకి చేరుతోంది. అక్కడ నుంచి నీరు, ఇతర మార్గాల్లో కోళ్లకు సంక్రమిస్తోంది. నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటంతో కొన్నిచోట్ల వైరస్ ప్రభావం చూపింది. అక్కడ చనిపోయిన వాటిని పూడ్చిపెట్టకుండా.. బయటపం దేయడంతోనే కోళ్లఫారాలకు చేరింది. ఉష్ణోగ్రతలు 32 నుంచి 34 డిగ్రీల మధ్య ఉంటే ఈ వైరస్ జీవించలేదని. ప్రస్తుతం రాష్ట్రంలోని అధికశాతం ప్రాంతాల్లో 34 డిగ్రీల పైనే నమోదవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

**ఉడికించిన మాంసం, గుడ్లు తినొచ్చు....**

గన్నవరం మాంసం, గుడ్లు తీసుకున్నా ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. అధిక ఉష్ణోగ్రతలో ఈ వైరస్ బతకలేదు. కోడిమాంసం, గుడ్లను మనం 100 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉడికిస్తాం. అప్పుడు అందులో ఎలాంటి వైరస్ ప్రభావం ఉండదని ఎన్టీఆర్ పశు వైద్య కళాశాల పౌల్ట్రీ సైన్స్ విభాగాధిపతి డి.నరేంద్ర తెలిపారు. బర్డ్ ఫ్లూగా తేలిన రెండు ఫారాల్లోని కోళ్లు, గుడ్లను పూడ్చిపెట్టాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలిచ్చాం. పూడ్చిపెట్టే ఒక్కో కోడికి రూ.90 చొప్పున పరిహారం అందిస్తాం. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా.. రెండు ఫారాల చుట్టూ కిలోమీటరు పరిధిలో రెడ్ అలర్ట్ ప్రకటించాం. అక్కడ మాత్రమే చికెన్ దుకాణాలు మూసివేయాలని ఆదేశించాం. చుట్టూ 10 కిలోమీటర్ల పరిధిలోనూ నిఘా పెట్టి పర్యవేక్షిస్తున్నాం. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో ఇబ్బంది లేదని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు తెలిపారు.

(మొదటి పేజీ తరువాయి)

# టిడ్కో ఇల్లు

మట్టి కుప్పలతో నిండిపోగా, బాత్‌రూముల తలుపులు, ఖాళీగా ఉన్న టిడ్కో ఇళ్లలో ఒక్కదానిలో కూడా వైరింగ్ లేదు. వైర్లు, స్విచ్‌బోర్డులు సరిగ్గా లేవు.ఏవి పనిచేయటం లేదు,ఒక్కో బ్లాక్ లో ఐతే పవర్ సప్లై కనెక్షన్స్ లేవు,కొన్ని చోట్ల ట్రాన్సఫార్మ్ నుండి అసలు కరెంటు వైర్ లే ఇవ్వలేదు,మరి కొన్ని చోట్లా తేన పట్టులు దర్శనమిస్తున్నాయి.పోనీ తెగించి ఉండిపోదామని లబ్ధిదారులు అనుకున్న సరైన రోడ్ మార్గం లేదు,బస్సు సౌకర్యం లేదు..ఇలా ఏ ఒక్క వసతి కూడా సరిగ్గా లేక లబ్ధిదారులు తీవ్ర ఆందోళనకు గురివుతున్నారు.విశాఖపట్నం మురికివాడల్లోని నిరుపేదల కోసం జీవీఎంసీ పరిధిలోని మొత్తం 13 ప్రాంతాల్లో జీం3 విధానంలో మొత్తం 20 వేలకు పైగా టిడ్కో ఇళ్లను లబ్ధిదారులు కోసం నిర్మించారు.

ఐతే ఇక్కడ వరుకు బానే ఉంది.ఇళ్లకు వెళ్లేందుకు లబ్ధిదారులు సిద్ధంగా ఉన్న సరైన వస్థలు లేక వెళ్ళాక పోతున్నారు.నివాసాలు నుండి బయటికి రావాలంటే సుమారు 3 కిలోమీటర్లు దాటి బయటకు రావాల్సిన పరిస్థితి నెలకొన్నది.నివాసాల ప్రాంతంలో కనీసం పాల దుకాణం కూడా లేదు..అంతే కాదు కొన్ని ఇళ్లకు ఇప్పటి వరుకు విద్యుత్ సప్లై కూడా లేకపోవడం లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అంతే కాదు కొన్ని ఇళ్లకు మంచి నీటి గొట్టాలు పనిచేయటం లేదు..ఇలా ఒకటి కాదు అనేక సమస్యలు చుట్టు ఉన్నాయి.సమస్యలు పై ప్రజా ప్రతినిధులు చుట్టూ తిరుగుతున్నా ఫలితం మాత్రం శున్యం.. బ్యాంకుల మాత్రం వరుస నోటీసులు పంపుతూ హడలిస్తోంది.లోన్ లు కట్టకపోతే సిబిల్ స్కోర్ పోతుంది.మీకు జీవితంలో ఏ బ్యాంకు రుణాలు ఇవ్వవని బెదిరిస్తుండటంతో సమస్య ప్రజలు గగ్గోలు పెడ్తున్నారు.తమను ఆదుకోవాలని ఎమ్మెల్యే లకు మొరపెట్టుకుంటారు.టిడ్కో ఇళ్ల కోసం బ్యాంకుల నుంచి లబ్ధిదారులు పాక్షిక ఒప్పందం చేసుకుంటే రుణం మంజూరు చేసినట్లే. నాటి నుంచి రెండేళ్ల వరకు లబ్ధిదారులు వాయిదాలు చెల్లించనవసరం లేదు.

ఆ గడువు కొంత మందికి ఇప్పటికే పూర్తి కావడంతో బ్యాంకుల నుంచి నోటీసులు అందుతున్నాయి. ఒకటి రెండు వాయిదాలు చెల్లించకపోతే డిఫాల్టర్లుగా మారతారని బ్యాంకర్లు హెచ్చరిస్తుండటంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము రుణాలు కట్టలేమని బ్యాంకు అధికారులకు చెప్తున్నా పట్టించుకోవడం లేదని మహిళలు వాపోతున్నారు. రుణాలిచ్చి, ఇళ్లు ఇవ్వకుండా బ్యాంకులు వేధింపులకు దిగడం సరికాదంటున్నారు.'బ్యాంక్? వాళ్లు ఇప్పటికే మాకు రెండుసార్లు నోటీసులు పంపించారు. ఇటు అద్దెలు కడుతూ అటు ఎప్పుడు ఇస్తారో తెలియని ఇళ్లకి ఇప్పటి నుంచే ఈఎమ్ఐలు ఎలా కడతాం.బ్యాంక్? వాళ్లు దురుసుగా ప్రవర్తిస్తున్నారు.

సంతకాలు ఎందుకు పెట్టారని హెచ్చరిస్తున్నారు.టిడ్కో ఇళ్లు వస్తున్నాయిలే అని సంబరపడ్డ లబ్ధిదారులు అప్పులు తెచ్చిమరీ డిపాజిట్లు చెల్లించారు. కూటమి ప్రభుత్వంలోనైనా తమకు ఇళ్లు వస్తాయని లబ్ధిదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# జగన్‌వస్తాడా...!

అవకాశం ఉంది. చంద్రబాబుతో సమానంగా మాట్లాడే చాన్సివ్వాలి..ఆయనతో పోటీగా ప్రోటోకాల్ కావాలి అంటే ఎవరూ పట్టించుకోరు. పరిస్థితులకు తగ్గట్లుగా రాజకీయం చేయడం చాలా ముఖ్యం. కానీ జగన్ ఆ పాయింట్ మిస్సవుతున్నారు.ఈ సారి ఆయనపై అనర్హతా టార్గెట్ లక్ష్యంగా ప్రభుత్వం అసెంబ్లీ సమావేశ తేదీలు ఖరారు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. జగన్ ఉన్న అరవై రోజుల పిరియడ్ ను పూర్తి చేసి ఆయనపై తదుపరి చర్యలు తీసుకోనున్నారు. ఈ లోపు చాలా రాజకీయాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. జగన్ సజ్జల మాటల్ని నమ్మి.. రాజకీయాలు చేస్తారో

..కాస్త ముందు చూపుతో వ్యవహరిస్తారో చూడాల్సి ఉంది.

# అమ్మవార్లకు స్నపన తిరుమంజనం

గోవిందరాజస్వామివారు శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో కలిసి తెప్పపై ఏడు చుట్లు చుట్టి భక్తులకు కనువిందు చేస్తారు.

ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో భజనలు, హరికథ, సంగీత కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి, టిటిడి జేఈవో శ్రీ వి.వీరబ్రహ్మం, ఎఫ్ఏ అండ్ సీఏవో శ్రీ ఓ.బాలాజీ, ఆలయ డెప్యూటీ ఈవోలు శ్రీమతి వి.ఆర్.శాంతి, శ్రీ సి. గోవింద రాజన్ ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## జిల్లాలో 75 కేంద్రాల్లోపరీక్షలకు 40,346 మంది హాజరు

### ఆర్ఐఓ, ప్రగడ దుర్గారావు



శ్రీకాకుళం, ఫిబ్రవరి 11, న్యూస్ వన్ ప్రతినిధి : ఇంటర్మీడియట్ బోర్డు పబ్లిక్ పరీక్షలు శ్రీకాకుళం జిల్లాలో 75 కేంద్రాల్లో జరుగుతాయని జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ అధికారి ప్రగడ దుర్గారావు చెప్పారు. ఈ పరీక్షలకు 40,346 మంది హాజరు అవుతారని పరీక్షలు జంబ్లింగ్ పద్ధతిలో జరుగుతాయని, సి సి కెమెరాల పర్యవేక్షణలో పకడ్బందీగా పరీక్షలు జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు.. ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల పదవ తేదీ నుండి ప్రారంభం అయ్యాయని అన్నారు. ప్రాక్టికల్ పరీక్షలకు 113 కేంద్రాలు కేటాయించగా తొలివిడతగా 61 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది వినూత్న రీతిలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు లేకుండా చేయాలని ఆలోచన చేసి ఆచరణలో ప్రజాభిప్రాయం తీసికొని మళ్లీ ప్రభుత్వ ప్రతిపాదన విరమించారని చెప్పారు. పాత పద్దతుల్లో పరీక్షలు జరుగుతాయని ఇందులో ఎటువంటి అనుమానం లేదన్నారు.

విద్యార్థులకు పరీక్షలు సమయంలో ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారని. ప్రతీ పరీక్ష కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పండ్కర్ పర్యవేక్షణలో ఈ ఏడాది ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరపటానికి అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవటం జరిగిందని దుర్గారావు స్పష్టం చేశారు.

## గిరిజన ప్రజల భద్రత చట్టం 1/70 ను సవరణ చేయవద్దు

### గిరిజన సంఘ నాయకులు. తాహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా





జమందస, న్యూస్ వన్ ప్రతినిధి : గిరిజన ప్రజల భద్రత చట్టం 1/70 ను సవరించాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని గిరిజన సంఘనాయకులన్నారు. ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మన్యం లో బంద్ జరుగుతున్న నేపథ్యంలో మందస తాసిల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1/70 చట్టాన్ని సవరిస్తే గిరిజనుల భవిష్యత్తు సంక్షోభంలో కురుకుపోతుందన్నారు. గిరిజన భూములకు రక్షణ కల్పించాలని, 100% ఉద్యోగాలు గిరిజనులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘ నాయకులు సవర.ధర్మారావు, సవర. ఫాల్గుణరవు, సవర.గురునాథ్, సవర. భావన్న, భీమారావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సేవలు నిరుపమానం

### - అందరి సహకారంతోనే సాధ్యమైంది

### - ఎమ్మెల్యే గొండు శంకర్




శ్రీకాకుళం, న్యూస్ వన్ ప్రతినిధి :లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సేవలు నిరుపమానమని, ఎప్పుడూ సేవలకై ముందుంటారని స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రథసప్తమి పర్వదినాన్ని రాష్ట్ర పండగగా ప్రకటించిన తరువాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవాలయంలో జరిగిన వేడుకలు అందరి సమష్టి కృషితో విజయవంతంగా నిర్వహించగలి గామన్నారు. స్థానిక విశాఖ కాలనీ పార్టీ కార్యాలయంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నుండి ప్రశంసా పత్రాన్ని అందుకున్న అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రశంసా పత్రాన్ని అందు కోవటంసంతోషంగా ఉందని, జోన్ చైర్మన్ పొన్నాడ. రవి కుమార్, మెంటార్ నటుకుల.మోహన్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వాయినాడు ఘటనకు ముందస్తుగా ఇరవై ఐదు వేల రూపాయలను శ్రీకాకుళం జిల్లా నుండి లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అందించిన విషయం గుర్తు చేశారు. ఇందులో భాగముగా పొన్నాడ రవి కుమార్, నటుకుల.మోహన్ మాట్లాడుతూ గొండు శంకర్ కృషితో రాష్ట్ర పండుగ ద్విగ్గిజయంగా పూర్తయిందని, ఇందుకు అధికారుల కృషి అభినందనీయమన్నారు.

# కూటమి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

## జన సైనికులకు బండారు శ్రీనివాస్ పిలుపు

కొత్తపేట, న్యూస్ వన్ ప్రతినిధి : ఉభయ గోదావరి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించుకోవడం ద్వారా యువతకు భరోసా ఏర్పడుతుందని కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఆలమూరు శ్రీకృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో మంగళవారం జరిగిన మండల స్థాయి జనసేన కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కొక్క సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు ప్రజల ఆదరాభిమానాలను విశేషంగా పొందుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. గ్రాడ్యుయేట్ల సమస్యలను, యువత ఆశలను శాసనమండలిలో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం వినిపిస్తారని బండారు శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. కూటమి నాయకులు ఏ విధమైన భేదాభిప్రాయాలు ప్రదర్శించకుండా ఒకరినొకరు సమన్వయం చేసుకుంటూ ప్రతి గ్రామంలోనూ ఉన్న గ్రాడ్యుయేట్ ఓటర్లను కలుసుకొని, వారితో మాట్లాడి, కూటమి అభ్యర్థికి ఓట్లు పడేలాగా చూడాలన్నారు. జనసేన నాయకులు, కార్యకర్తలు పవన్ కళ్యాణ్ ఆశయ సాధన కోసం పనిచేస్తున్నారని ఆయన ప్రశం



సించారు. నేడు దేశవ్యాప్తంగా పవన్ కళ్యాణ్ పనితీరుకి మంచి ప్రతిస్పందన వస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ పేరు మారుమ్రోగుతుందని ఇదే ఆయన పనితీరుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. భవిష్యత్తు అంతా జనసేనదే అని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సూరపరెడ్డి సత్య, సలాది జయప్రకాష్ నారాయణ, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, నల్లా వెంకన్న, తోట వెంకటేశ్వరరావు, గారపాటి శ్రీనివాస్ చౌదరి, గారపాటి త్రిమూర్తులు, కొత్తపల్లి నగేష్, పడాల అమ్మిరాజు,గుత్తుల నాగేశ్వరరావు, సిరిగినేడి పట్టాభి, చల్లా బాబి, చల్లా వెంకటేశ్వరరావు, శీలం వెంకటరమణ, దేశాబత్తుల సత్యనారాయణ, దాసరి వీర పండు, మండల నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు మార్కెట్ సందర్శించిన ఎమ్మెల్యే గుండు శంకర్



శ్రీకాకుళం, న్యూస్ వన్ ప్రతినిధి : నగరంలోని మార్కెట్లో ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. మార్కెట్ పరిశీలిస్తూ అక్కడ ఉన్న వర్తకుల,తో ముఖాముఖిలో పాల్గొని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్కెట్లో నిత్యం రద్దీగా ఉంటుందని పారిశుధ్యం పూరి స్థాయిలో ఉండే విధంగా చర్య తీసుకుంటామని వారికి ఉండే సమస్యలపై పరిశీలించి సాధ్యమైనంత మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మార్కెట్లో ఎమ్మెల్యే సందర్శన సమయంలో ఇద్దరు యువకులు అనుమాన,స్పదంగా, తిరగడం చూసి వారిని పట్టు కున్నారు. వారి నుండి ఆరా తీయగా గంజాయి సేవించి ఉన్నట్లుగా గుర్తించారని దీనిపై తక్షణమే చర్యలుకు పోలీసులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. మార్గ ద్రవ్యాల వైపు యువత చెడు మార్గానికి వెళ్ళకుండా ఎన్నో చర్యల చేపట్టినప్పటికీ గంజాయి వంటి మత్తు పదార్థాలను మార్కెట్లో సరఫరా కావడం ఆశ్చర్యంగా ఉందని ఇటు వంటి ప్రమాదకరమైన మార్గ ద్రవ్యాలను నియంత్రించడానికి పోలీస్ వ్యవస్థ గట్టి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. పట్నంలోని యువత ఇటువంటి చెడు వ్యసనాలకు బానిస, అవుతున్నారని పోలీస్ వ్యవస్థ సంకల్పం పేరుతో ఎన్నో అవగాహన కార్యక్రమాలు చేపడు తుందని అయినప్పటికీ ఇంకా మార్పు రావట్లేదని తెలిపారు. ప్రజలు అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను గుర్తించాలని వెంటనే పోలీసులకు సమాచారము ఇవ్వాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే స్వయంగా గం జాయి వ్యక్తులు పట్టుకోవడం అందరికీ ఆశ్చర్యం గురిచేసింది. ఇటువంటి చర్యలు ఏ ప్రజా నాయకుడు చేయలేరని ప్రజలు అంటు న్నారు. ప్రజల మధ్య ఉన్న నాయకులకు ఇటువంటి సాధ్యమ, వుతా యని స్థానికులు అంటున్నారు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## పీఎంఎంఎస్ఏ తో మాతృ శిశు మరణాలు నిర్మూలన సాధ్యం



ఆలమూరు, న్యూస్ వన్ ప్రతినిధి : మాతృత్వ, శిశు మరణాల నివారణకు, చిన్నారుల మెరుగైన ఆరోగ్య సంరక్షణను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ (పీఎంఎంఎస్ఏ) పథకం విశేషంగా దోహదపడుతుందని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి,సువర్చలాదేవి, డి.సాయి కిషోర్ అన్నారు. పీఎంఎంఎస్ఏ పథకంలో భాగంగా ఆయా పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన పీఎంఎంఎస్ఏ శిబిరంలో సుమారు 113 మంది బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమా వేశంలో బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సేవలను, తీసుకోవలసిన జాగ్రత్తలను ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది వివరించారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా బాలింతలు, గర్భిణులకు ప్రతి నెలా రెండవ వారం నిర్వహిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులు సుఖ ప్రసవాలు జరిగే విధంగా కృషి చేస్తున్న పీహెచ్‌సీల సేవలను ప్రజలకు తెలియజేయాలని వైద్యారోగ్య సిబ్బందికి వారు సూచించారు. అనంతరం గర్భిణులకు బలవర్థక ఓషధాలను అందజేశారు.

కుష్ఠువ్యాధిగ్రస్తులకు పరీక్షలు

మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం కుష్టువ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. డీపీఎంఓ కె.వెంకటేశ్వరరావు నేతృత్వంలో వైద్యారోగ్య సిబ్బంది కుష్టువ్యాధిగ్రస్తులకు వైద్య సేవలను అందించి ఉచితంగా మందులను అందజేశారు. కుష్టువ్యాధి నివారణకు అధునాతనమైన ఎం%ఎ%ెటీ చికిత్స అందుబాటులోకి వచ్చినందున రోగులెవ్వరూ అధైర్య పడవద్దని వైద్యాధికారులు సువర్చలాదేవి, సాయికిషోర్ సూచించారు. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవివి,రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి,ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

## నబార్డు నిధులతో చేపట్టిన పనులు

# మార్చిలోగా పూర్తిచేయాలి

**- మత్స్యశాఖకు మంజూరైన నిధులతో జెట్టీల నిర్మాణం చేపట్టాలి-**

**- జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదేశాలు**

విజయనగరం (ఫిబ్రవరి 11) న్యూస్ వన్ ప్రతినిధి : జిల్లాలో జాతీయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నబార్డు) ఆర్థిక సహాయంతో గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి(ఆర్.ఐ.డి.ఎఫ్) కింద ప్రాజెక్టులు చేపట్టిన ప్రభుత్వ శాఖలు ఆయా పనులను త్వరగా పూర్తిచేసి సంబంధిత పనులపై నివేదికలను నబార్డు అధికారులకు వెంటనే అందజేయాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదేశించారు. జిల్లాలో నబార్డు - ఆర్.ఐ.డి.ఎఫ్. నిధులతో చేపట్టిన పనులపై జిల్లా కలెక్టర్ ఆ బ్యాంకు అధికారులు, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులతో మంగళవారం సమీక్షించారు. జిల్లాలో పది ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో రూ.926.60 కోట్ల అంచనా వ్యయంతో 203 ప్రాజెక్టులను చేపట్టగా, వీటిలో నబార్డు నుంచి ఆర్.ఐ.డి.ఎఫ్. కింద రూ.636.35 కోట్ల నిధులను కేటాయించడం జరిగిందని నబార్డు ఏ.జి.ఎం. నాగార్జున తెలిపారు. ఇందులో రూ.423.06 కోట్లు ఆయా ప్రభుత్వ శాఖలు ఖర్చుచేయడం జరిగిందని వివరించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలు నబార్డు నిధులతో చేపట్టిన రోడ్లు, స్కూలు భవనాలు, ఆసుపత్రులు, అంగన్ వాడీ భవనాలు, అగ్రిల్యాబ్‌లు తదితర మౌలిక వసతుల ప్రాజెక్టులు, వాటి ప్రస్తుత స్థితిపై కలెక్టర్ సమీక్షించారు.మత్స్యశాఖ ఆధ్వర్యంలో రూ,25.65 లక్షలతో పనులు మంజూరైనప్పటికీ చేపట్టనందున ఆ నిధులను వినియోగించి పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో మత్స్యకారులకు ఉపయోగపడే విధంగా రెండు ఫిషింగ్ జెట్టీల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని మత్స్యశాఖ డి.డి. నిర్మలాకుమారి, విద్య, సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ అధికారి డివిఎన్ మూర్తిలను ఆదేశించారు. బి.సి.రెసిడెన్షియల్ స్కూల్ భవనాల నిర్మాణం పూర్తయినప్పటికీ బిల్లులు చెల్లించలేదని సంక్షేమ ఇంజనీరింగ్ విభాగం



ఇ.ఇ. వివరించారు. ఇదే విషయాన్ని బ్యాంకుకు నివేదించాలని కలెక్టర్ సూచించారు. రెండు సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల భవనాలు చేపట్టి పూర్తిచేయడం జరిగిందని, బిల్లులు కూడా చెల్లించామని తెలిపారు.వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా నియోజకవర్గ స్థాయిల్లో ఏడు ల్యాబ్ ల నిర్మాణం పోలీసు గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టగా జిల్లా స్థాయి ల్యాబ్ మినహా మిగిలిన పనులన్నీ పూర్తిచేయడం జరిగిందని వ్యవసాయశాఖ జె.డి. వి.టి.రామారావు తెలిపారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా ఏడు రోడ్ల పనులను మంజూరు చేయగా వీటిలో ఒక రోడ్డు పని పూర్తయ్యిందని, నాలుగు పనులు జరుగుతున్నాయని, మరో పని కాంట్రాక్టు సంస్థకు అప్పగించాల్సి వుందని ఎస్.ఇ. శ్రీనివాస్ వివరించారు. వేపాడ మండలంలో సోంపురం-అతవ రోడ్డు పనిని మార్చి 15లోగా పూర్తిచేసి కాంట్రాక్టరుకు బిల్లు చెల్లించాలని కలెక్టర్ ఆదేశించారు. తెర్లాం మండలంలోనే మూడు రోడ్ల నిర్మాణాన్ని రూ.6.05 కోట్లతో చేపట్టామన్నారు.వైద్య ఆరోగ్య ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ఆసుపత్రుల నిర్మాణం పనులు దాదాపుగా పూర్తయ్యాయని మార్చి నాటికి పెండింగ్ పనులు కూడా పూర్తిచేయడం జరుగుతుందని ఇ.ఇ. వివరించారు.సమగ్రశిక్ష ఆధ్వర్యంలో చేపట్టిన పాఠశాల అదనపు భవనాల పనులకు సంబంధించి గత ప్రభుత్వ

### జిల్లా ఇపిఎఫ్ఓ

## కార్యాలయం ముందు పెన్షనర్ల ధర్నా




విజయనగరం సిటీ న్యూస్ వన్ ప్రతినిధి : దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం ఈపీఎస్-95 పెన్షనర్లు 78 లక్షల 49వేల మంది ఉన్నారు వీరందరూ చెల్లించిన పెన్షన్ కార్పస్ ఫండ్ మొత్తం ఇపిఎఫ్ఓ వద్ద 2024 మార్చి 31 నాటికి నిల్వ మొత్తం రూ 8,88.269 కోట్లు ఈ కార్పస్ పైన వచ్చే వడ్డీ మొత్తం రూ. 49.530 కోట్లు ఈపీఎస్ 95 పెన్షనర్లకు పెన్షన్ రూపంలో చెల్లించు చున్న మొత్తం రూ.15.130 కోట్లు మాత్రమే ఇస్తూ మిగిలిన రూ.44.400 కోట్లు మొత్తం మరల తిరిగి కార్పస్ ఫండ్ కు జమకబడుతుంది.కనీస పెన్షన్ పెంపుదల కేంద్ర ప్రభుత్వం పరిశీలనలో లేదని నిధులు లేని కారణంగా పెంచలేక పోతున్నామని మోడీ ప్రభుత్వం పచ్చి అబద్ధాలు చెబుతున్నది. దీనిని తీవ్రంగా ఖండిస్తూ కనీస పెన్షన్ 9000/- డిఎతో కలిపి ఇవ్వాలని పెన్షన్ దారులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలు పరిష్కరించాలని,చలో ఢిల్లీ కార్యక్రమాలు జయప్రదం చేయాలని లేనియెడల ఆందోళన ఉధృతం చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచరిస్తున్నామని సీఐటీయూ అధ్యక్షులు పి శంకర్రావు పేర్కొన్నారు ఈ ధర్నాలో ఇతర జిల్లా యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### నేరస్తులను గుర్తుంచుటకు

## సీసీ కెమెరాలు ఏర్పాటు



విజయనగరం సిటీ, న్యూస్ వన్ ప్రతినిధి : విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఆదేశాల మేరకు విజయనగరం పట్టణంలోని తోట పాలెం , వైయస్సార్ కాలనీ వద్ద కొంతమంది దాతలు సహాయంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడమైనది.తోట పాలెం, వైయస్సార్ కాలనీ నుండి ప్రదీప్ నగర్ లోని ఎస్బిఐ బ్రాంచ్ వరకు సుమారు 14 కెమెరాలను ఇన్స్టాల్ చేయడం జరిగింది. సదరు కెమెరాలు పగటిపూట రాత్రిపూట మరియు అత్యాధునిక టెక్నాలజీతో పోలీస్ స్టేషన్ కు అనుసంధానం చేయబడుతుంది. అంతేకాకుండా మిగతా చోట్ల కూడా దాతలు సహాయంతో పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ కెమెరాలు వలన నేరస్తులపై నిఘా ఉంచడంతో పాటు, ఏదైనా నేరం జరిగిన వెంటనే ఎవరు చేశారు , ఎంతమంది నేరంలో పాల్గొన్నారు వంటి విషయాలు తెలుసుకుని నేరస్తులను పట్టుకోవడానికి అవకాశం ఉంటుంది.

### పండిట్ దీనదయల్ ఉపాధ్యాయుకు నివాళులర్పించిన ఎమ్మెల్యే నడికుదుటి ఈశ్వరరావు



రణస్థలం, న్యూస్ వన్ ప్రతినిధి : దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి రోజున ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 11 దీన్ దాయల్ ఉపాధ్యాయ భారతదేశ రాజకీయ వర్ణపటం,పై శాశ్వత ప్రభావాన్ని చూపారని, ఆయన కారణంగా దేశంలో వివిధ రాష్ట్రాల ఏర్పాటు జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి సురేష్ , జగన్నాథం లక్ష్మణరావు, శ్రీను, మల్లేశు, కృష్ణానందం, వారహమూర్తి, తిరునాధ, రమణ, చిరంజీవి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### ఎం ఎల్ సి ఎన్నికల ప్రచారంలో వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్

రాజమండ్రి, న్యూస్ వన్ ప్రతినిధి : తూర్పు గోదావరి - పశ్చిమ గోదావరి జిల్లాల కూటమి బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్ ని గెలిపించాలని కోరుతూ వి ఎం ఆర్ డి ఎ ఛైర్మన్, తాడేపల్లి గూడెం ఎం ఎల్ సి ఎన్నికల పరిశీలకులు ఎం వి ప్రణవ్ గోపాల్ విస్తృత ప్రచారం చేశారు. తాడేపల్లిగూడెం తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్ వలవల బాబ్జీ గారితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం లో పాల్గొన్నారు. పలు ప్రైవేట్ విద్యా సంస్థ లకు వెళ్లి అక్కడ ఉపాధ్యాయులను కలిసి కూటమి పార్టీల తరుపున పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్ కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అదేవిధంగా పలు విద్యార్థి సంఘాల నాయకులను, పట్టభద్రుల ను కలిసి ప్రచారం చేస్తూ, కరపత్రాలను అందజేశారు.



## ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో
# అభ్యర్థులందరూ అర్హులే

**పది మంది నామినేషన్లనూ ఆమోదించిన రిటర్నింగ్ అధికారి ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**
**అభ్యర్థులతో కలిసి ప్రక్రియను ఆసాంతం పరిశీలించిన ఎన్నికల అబ్జెర్వర్ ఎం.ఎం. నాయక్**




విశాఖపట్టణం, ఫిబ్రవరి 11 : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానంలో పోటీ చేసేందుకు నామినేషన్ వేసిన అభ్యర్థులందరి నామ పత్రాలు ఆమోదం పొందాయి. ఎన్నికల అబ్జెర్వర్ ఎం.ఎం. నాయక్ ఆధ్వర్యంలో.. అభ్యర్థుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి, విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ మీటింగు హాలులో పరిశీలన ప్రక్రియను నిర్వహించారు. అభ్యర్థులు సమర్పించిన అన్ని పత్రాలను సునిశితంగా పరిశీలించారు. పది మంది అభ్యర్థులూ మొత్తం 20 సెట్లు సమర్పించగా అందులో నాలుగు సెట్లు సరిగ్గా లేకపోవటంతో తిరస్కరణకు గురయ్యాయి. అయితే అభ్యర్థులు ప్రత్యామ్నాయ సెట్లు సమర్పించటంతో వాటిలో సరైన వాటిని రిటర్నింగ్ అధికారి పరిగణనలోకి తీసుకొని ఆమోదించారు. ప్రమాణాలకు అనుగుణంగా అందరి పత్రాలు ఉండటంతో పది మంది అభ్యర్థుల తాలూక నామినేషన్లను ఆమోదిస్తూ రిటర్నింగ్ అధికారి నిర్ణయం వెలువరించారు. అభ్యర్థుల సమక్షంలో జరిగిన పరిశీలన ప్రక్రియలో భాగంగా రిటర్నింగ్ అధికారి ఒక్కో అభ్యర్థి తాలూక పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అభ్యర్థులు సమర్పించిన పత్రాల తాలూక వివరాలను మిగిలిన వారికి తెలిసేలా చదివి వినిపించారు.

**20 సెట్లకు గాను 16 ఆమోదం పొందాయి...**

ఫిబ్రవరి 03 నుంచి 10వ తేదీ సాయంత్రం వరకు జరిగిన నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మొత్తం 10 మంది అభ్యర్థులు 20 సెట్లను సమర్పించారు. సత్తలూరి శ్రీరంగ పద్మావతి, పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావు, పోతల దుర్గారావులు రెండేసి సెట్లు వేయగా వాటిల్లో ఒక్కొక్కటి తిరస్కరణకు గురయ్యాయి. ప్రమాణాలకు అనుగుణంగా అర్హత కలిగిన మిగిలిన సెట్లు ఆమోదం పొందాయి. పాకలపాటి రఘువర్మ, గాదె శ్రీనివాసులు నాయుడు, కోరెడ్ల విజయగౌరి మూడేసి సెట్లు వేయగా అన్నీ అర్హత సాధించాయి. కోసూరు రాధాకృష్ణ, నూకల సూర్యప్రకాష్, రాయల సత్యన్నారాయణ ఒక్కో సెట్ వేయగా ఆమోదం పొందాయి.

**తుది జాబితా ప్రకారం 22,493 మంది ఓటర్లు**

తుది విడత జాబితా ప్రకారం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 22,493 మంది ఓటర్లు ఉన్నారని ఒక అభ్యర్థి అడిగిన ప్రశ్నకు బదులుగా రిటర్నింగ్ అధికారి, విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. తొలి విడత జాబితా ప్రకారం 21,555 మంది ఓటర్లు ఉండగా ఫిబ్రవరి 10వ తేదీ నాటికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తుది జాబితా సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. కొత్తగా 938 మంది ఓటర్లు పెరిగారని వివరించారు. 13వ తేదీన సాయంత్రం 03.00 గంటల వరకు నామినేషన్ల ఉప సంహరణ ప్రక్రియ ఉంటుందని, అదే రోజు సాయంత్రం 03.30 గంటలకు పోటీలో ఉండే అభ్యర్థులందరితో సమావేశం ఉంటుందని హాజరుకావాలని రిటర్నింగ్ అధికారి విజ్ఞప్తి చేశారు. నామినేషన్ల పరిశీలన ప్రక్రియలో ఇన్‌ఛార్జి డీఆర్వో సీతారామారావు, ఎన్నికల సెల్ అధికారులు పాల్గొన్నారు.

## మార్చి 17 నుంచి ఏప్రిల్ 1 వరకు
# పదో తరగతి పబ్లిక్ పరీక్షలు

**134 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్న 29,997 మంది విద్యార్థులు**
**డీఈవోతో కలిసి ఏర్పాట్లపై సమీక్షించిన ఇన్ఛార్జి డీఆర్వో సీతారామారావు**



విశాఖపట్టణం, ఫిబ్రవరి 11 : మార్చి 17 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా ఇన్ఛార్జి రెవెన్యూ అధికారి సీతారామారావు ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం వహించి పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని రకాల సాంకేతిక ప్రక్రియలను సకాలంలో పూర్తి చేసి పరీక్షల నిర్వహణకు అందరూ సన్నద్ధంగా ఉండాలని చెప్పారు. మార్చి 17వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్, ప్రయివేటు, ఓపెన్ ఇంటర్ పరీక్షల నిర్వహణ, ఇతర ఏర్పాట్లపై డీఈవోతో కలిసి మంగళవారం ఉదయం కలెక్టరేట్ వీసీ హాలులో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాలు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు.

**134 కేంద్రాలు, 29,997 మంది విద్యార్థులు**

సమీక్షలో భాగంగా డీఈవో ఎన్. ప్రేమ్ కుమార్ పలు వివరాలను వెల్లడించారు. మార్చి 17వ తేదీ నుంచి ఏప్రిల్ ఒకటి వరకు 134 కేంద్రాల్లో జరిగే పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 28,523, ఓపెన్ విద్యార్థులు 1,404 కలిపి మొత్తం 29,997 మంది హాజరవుతున్నారని పేర్కొన్నారు. వారిలో బాలలు 15,094 మంది కాగా, బాలికలు 13,429 మంది ఉన్నారని వివరించారు. రెగ్యులర్ విద్యార్థులకు రోజూ ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు, ఓపెన్ విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఏఏఅలాగే మార్చి 03 నుంచి 15వ తేదీ వరకు ఓపెన్ ఇంటర్ విద్యార్థులకు రోజూ ఉదయం 9.00 నుంచి 12.00 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వివరించారు. రెండు కేంద్రాల్లో జరిగే ప్రయోగ పరీక్షలకు 404 మంది, ఏడు కేంద్రాల్లో జరిగే థియరీ పరీక్షలకు 1,271 మంది హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం రోజు విడిచి రోజు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. అన్ని విభాగాల అధికారులు పూర్తి సమన్వయం వహించి పరీక్షలను విజయవంతంగా నిర్వహించటంలో పూర్తి సహకారం అందించాలని ఈ సందర్భంగా డీఈవో విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ, పోలీస్, విద్యుత్, జీవీఎంసీ, వైద్యారోగ్య, రవాణా, విద్య, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 1/70 గిరిజన ఏజెన్సీ చట్టంలో ఎటువంటి మార్పులు లేదు

**అరకు నియోజకవర్గ ఇంచార్జ్ ఆర్టీసి విజయనగరం రీజినల్ చైర్మన్ దొన్నుదొర**



ఆరుకులోయ ఫిబ్రవరి 11. ( న్యూస్ వన్ ప్రతినిధి). గిరిజన ఏజెన్సీ ప్రత్యేక జీవో నెంబర్ పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని. 1/70 గిరిజన ఏజెన్సీ చట్టంలో ఎటువంటి మార్పులు లేదని. చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం దొన్నదొర ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ1986 నవంబర్ 5న నాటి ఎన్టీఆర్ ప్రభుత్వం జీఓ 275 5వ షెడ్యూల్‌లోని 5(1) కింద ఉపాధ్యాయ పోస్టుల్లో స్థానిక ఆదివాసులకే 100 శాతం ఇవ్వాలని స్పష్టం చేసిందన్నారు. కొంత మంది న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కోర్టు తీర్పుకు అనుగుణంగా 2000 జనవరి 10న నాటి చంద్రబాబు ప్రభుత్వం జీఓ 275లో మార్పులు చేసి ఆదివాసులకు 100 శాతం ఉపాధ్యాయ పోస్టుల భర్తీని స్పష్టం చేసేలా జీఓ 3ను విడుదల చేసిందన్నారు. దీనిపై కూడా కొంతమంది సుప్రీం కోర్టుకు వెళ్లగా, 2002లో సుప్రీం కోర్టు జీఓ 3ను రద్దు చేసిందన్నారు. గిరిజన ప్రాంత యువతకు గుండెకాయలాంటి జీఓ నంబర్ 3ను సుప్రీంకోర్టు కొట్టివేస్తే రివ్యూ పిటిషన్ వేయాల్సిన వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందనీ. షెడ్యూల్డ్ ప్రాంతంలో 100 శాతం ఉద్యోగాలు ఆదివాసీలకు దక్కడం జగన్‌కు, వైసీపీ వారికి ఇష్టం లేదన్నారు. గిరిజన ప్రాంత యువత ముక్తకంఠంగా కోరినా జగన్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోలేదనీ. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ దృష్టికి జీ.వో: 3 అంశం తీసుకురాగానే పునరుద్ధరించడానికి కృషి చేస్తామని, న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతంలో వివిధ, పార్టీలు ప్రజల సంఘాల నాయకులకు విజ్ఞప్తి చేస్తున్నా. 1/70 ఎటువంటి మార్పు రాదు. ఇది కేవలం రాజకీయ లబ్ధికోసం వైఎస్ఆర్సీపీ చేస్తున్నా బూటకపు రాజకీయం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## ప్రశాంతంగా కొనసాగుతున్న
# ఏజెన్సీ మన్యం బంద్




అరకు లోయ ఫిబ్రవరి 11.( న్యూస్ వన్ ప్రతినిధి) ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1/70 చట్టం సవరణ చేయాలన్న వ్యాఖ్యలను నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో 48 గంటల మన్యం బంద్ కొనసాగుతుంది. మంగళవారం ఉదయం 6:00 నుండి అరకులోయ నియోజకవర్గం మండల కేంద్రంలో ప్రధాన రహదారి కూడలిలా వద్ద ఆదివాసి గిరిజన సంఘమాధ్యంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు ఉద్యోగ సంఘాలు విద్యార్థి సంఘాల నాయకులతో మన్యం బంద్ ప్రశాంతంగా కొనసాగుతోంది. అరకులోయ మండల కేంద్రంలో మూతబడిన వాణిజ్యసముదాయాలు నిర్మాణుష్యంగా మారిన ప్రధాన రహదారులు. దీంతో వాహన రాకపోకలు పూర్తిగా నిషేధించబడ్డాయి. అయితే ఒకపక్క ఆదివాసి సంఘాలు. మరోపక్క రాజకీయ పార్టీలు బందుకు మద్దతు ప్రకటించింది. దిగివచ్చినా ప్రభుత్వం. స్పీకర్ స్థానం నుంచి అయ్యన్నపాత్రున్ని తక్షణమే తొలగించాలని. రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. 1/70 చట్టం పై మాట్లాడిన మాటలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే తలదించాల్సిన దుస్థితి వచ్చిందని. ప్రభుత్వంలో కనీసం చట్టాలపై అవగాహనలేనీ వారు ఉన్నారని. చట్టాల పై అవగాహన లేకుండా అవహేళన, చులకనగా మాట్లాడరని ప్రజా సంఘాలు మండిపడ్డారు. స్పీకర్ పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.చట్టాన్ని ఉల్లంఘించి ఎవరైతే ఏజెన్సీలో బ్రతుకుతున్నారో వాళ్ళందర్నీ ఏజెన్సీ ప్రాంతాల నుంచి తరచించాలి. ప్రభుత్వం ఆదివాసి పక్షపాతిగా, ఆదివాసి చట్టాలను అమలు చేసే పార్టీగా కొనసాగితే వారిని ప్రభుత్వంగా ఆదివాసులు విశ్వసిస్తారు. మళ్ళీ మీకే ఓటు వేయటానికి ముందుకొస్తారు.

స్పీకర్ బేశరత్తుగా బహిరంగ క్షమాపణ చెప్పించాలని. ఇంతటితో ఉద్యమం ఆపేది లేదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ప్ర ధాన కార్యదర్శి బాల్దేవ్. అరకులోయ వైసిపి ఎమ్మెల్యే మత్యలింగం. ఎమ్మెల్సీ రవిబాబు. కాంగ్రెస్ నాయకురాలు శాంత కుమారి. సిపిఎం పార్టీ నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భూలోకమాంబ అమ్మవారిని
# దర్శించుకున్న కార్పొరేటర్ ముమ్మన





పెందుర్తి, న్యూస్ వన్ ప్రతినిధి : జీవీఎంసీ 95వ వార్డు చింతల అగ్రహారం, గవరపాలెం గ్రామ ఆరాధ్య దేవత శ్రీ భూలోకమాంబ అమ్మవారి తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారి తీర్థం పురస్కరించుకొని గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా పెందుర్తి బిజెపి నేత,స్థానిక జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పాల్గొని అమ్మవారికి విశేష పంచామృతాభిషేకములు మరియు కుంకుమ పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు,

కార్యక్రమంలో గ్రామ పెద్దలు సర్పంచ్ దాడి గోపి వెంకటలక్ష్మి,మాజీ సర్పంచ్ లు ఆళ్ల తాతారావు, పులమరశెట్టి వెంకటరావు, పులమరశెట్టి అప్పారావు, మరియు కాళ్ళ సురేష్, పిడివి. ప్రసాద్, మద్దాల శ్రీనివాసరావు, పులమరశెట్టి లక్ష్మణ్,బొడ్డేటి జగదీశ్, ఆడారి సన్యాసిరావు, బొడ్డేటి గోవింద్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

# కాపునాడు ఆర్థిక సహాయం



భీమునిపట్నం, న్యూస్ వన్ ప్రతినిధి :భీమిలి కాపునాడు అధ్యక్షులు చెల్లూరు గౌరీనాయుడు అధ్యర్యంలో కాపునాడు సంఘం ఉపాధ్యక్షులు కాయల ప్ర భాకర్ కుమార్తె ఉప్పాడ గాయత్రి కిరణ్మయి నాగుల చవితి నాడు పుట్టలో పాలు పోస్తూ ప్రమాదవశాత్తు పడిపోయి పోయి తలకి వెన్నుముక కి దెబ్బలు తగిలాయి. గత నాలుగు నెలల నుంచి లేవలేని స్థితిలో బెడ్ మీద ఉం డటం వలన భీమలి కాపునాడు సంఘం వారికి ముప్పై ఒక్క వేల అయిదు వందల రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగిందని భీమిలి కాపునాడు సంఘం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ప్రగడ చంటి, కోశాధికారి నాగిరెడ్డి స్వామి, సభ్యులు గొరపల్లి సన్యాసిరావు, అడపా లాలుబాబు, కాయల ప్రభాకర్, నాగిరెడ్డి మోహనరావు, ఈటి గోవిందరావు, గేదెల సత్యనారాయణ, ఏ అప్పలనారసయ్య పి.రాజేంద్ర ప్రసాద్, ఐ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ రాష్ట్ర బీసీ మహిళ విభాగంలో చోటు

**స్పోక్ పర్సన్ గా తోనంగి వెంకటరమణి నియామకం**





విశాఖ పశ్చిమ, న్యూస్ వన్ ప్రతినిధి :జాతీయ బీసీ సంక్షేమ సంఘం విజయవాడ వేదిక నిర్వహించారు. రాష్ట్ర బీసీ మహిళ విభాగంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గం 58 వార్డ్ ఏదురువానిపాలెం చెందిన తోణంగి వెంకటరమణి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణయ్య ఆదేశాలతో బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు వై నాగేశ్వరరావు సూచనలతో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏపీ ఇంచార్జ్ నూకలమ్మ వారి చేతుల మీదుగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం తోణంగి వెంకటరమణికి రాష్ట్ర మహిళా స్పోక్ పర్సన్ గా నియమించినట్లు పత్రాన్ని అందజేశారు..


## ఉన్నత విలువలు కలిగిన
# విద్యను అందించాలి...!

**- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు**




ఆనందపురం, న్యూస్ వన్ ప్రతినిధి : ఆనందపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీముద్ర ఇంగ్లీష్ మీడియం పాఠశాలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నత విలువలు కలిగిన విద్యను అందించి పాఠశాల యాజమాన్యం మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. లాభాపేక్ష తో కాకుండా నాణ్యమైన విద్యను అందించి సమాజానికి ఉత్తమ పౌరులను తయారు చేయాలన్నారు. సామాజిక బాధ్యతగా తీసుకొని ప్రస్తుత కాలానికి అనుగుణంగా బోధన జరపాలన్నారు. ఒక మంచి సంకల్పంతో ఏర్పాటు చేసిన ఈ పాఠశాల మిగతా వారికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కుప్ప.లహరి, డైరెక్టర్లు కాకర సురేష్ కుమార్, పల్లి వీరాస్వామిలు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు మెమెంటో అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోరాడ రాజబాబు, జనసేన పార్టీ భీమిలి ఇన్చార్జ్ పంచకర్ల సందీప్, సీనియర్ నాయకుడు కాకర వెంకటరమణ, స్థానిక సర్పంచ్ చందక లక్ష్మి లతోపాటు మండలంలోని అన్ని పంచాయతీల నుండి సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని పార్టీల నాయకులు పార్టీలు కతీతంగా పాల్గొనడం విశేషం.

# స్వర్గీయ మజ్జి అప్పారావు విగ్రహావిష్కరణ



ఆనందపురం, న్యూస్ వన్ ప్రతినిధి : కీర్తిశేషులు మజ్జి అప్పారావు విగ్రహ ఆవిష్కరణ తర్లు వాడలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్,భీమిలి నియోజకవర్గం వైకాపా ఇంచార్జ్ మజ్జి చిన్న శ్రీను లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యావంతుడు, మంచి వ్యక్తిత్వం కలిగిన యువకుడ్ని కోల్పోవడం చాలా బాధగా ఉందన్నారు. పేదవారి కష్టసుఖాల్లో పాలుపంచుకొని తన అన్నయ్య మజ్జి వెంకటరావు అడుగుజాడల్లో నడుచుకుని ఎన్నో సమస్యలు పరిష్కరించారని ప్రజలే చెబుతున్నారంటే అతని సేవలు గర్వించదగ్గవన్నారు. అతని జ్ఞాపకార్థం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. అలాగే గ్రంథాలయ ప్రారంభోత్సవంలో కూడా మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ లు చిన్న శ్రీను పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ,ఎంపీపీ మజ్జి వెంకటరావు తో పాటు జడ్పిటిసి కోరాడ వెంకటరావు, వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు బంక సత్యం, నాయకులు బంటుమిల్లి మణిశంకర్ నాయుడు, గంధ్రెడ్డి శ్రీనివాసరావు, పిన్నింటి వెంకటరమణ, ఓం సుఖీభవ మెడికల్స్ అధినేత కోరాడ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

Printed Published and Owned by Editor : **PALLANTI SRI HARI**, ASSOCIATED Editor by **NAKKKANA AJAY KUMAR YADAV**, D.NO-MIG-73/B,Phase-1, Madhvadhara, Vuda Colony,Marripalem (P), Visakhapatnam-530018. Andhrapradesh,
Printed at Swetha Printers SriRama Residency beside ICICI Bank Street, SR Street, Nellore District, Andhra Pradesh 524415, **Ph:0891-4815910**, 9948219494,
RNI No. APTEL/2011/39524, Email Id : **www.newsoneone@gmail.com, news1telugutv@gmail.com. Website : www.newsone.co.in, www.newsonetv24x7.com**